క్లుప్తంగా

పోచమ్మగడ్డతండాలో తుల్జాభవాని పూజలు

జడ్చర్ల టౌన్: మండలంలోని పోచమ్మగడ్డతండాలో బుధవారం గిరిజనుల ఆరాధ్యదైవం తుల్జాభవాని పూజలు నిర్వహించారు. తండాలోని ప్రతి ఇంటిని శుద్ధి చేసి ఇంటి ఆవరణలో టెంట్లు వేసి పీటలపై అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ నాయకురాలు బాలత్రిపురసుందరి దేవి హాజరై పూజలు చేశారు.

లక్ష్మీనర్సింహ, శివపార్వతుల కల్యాణం



జడ్చర్ల టౌన్: సాయినగర్ సకలదేవతల ఆలయం వార్షికోత్సవం పురస్కరించుకుని మంగళవారం లక్ష్మీనర్సింహస్వామి, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మహాగణపతి పూజ, ధ్వజారోహణం, పుణ్యాహవాచనం, నాంది సమారాధన, సర్వతోభద్రమంటపారాధన, సకలదేవతామూల విరాట్ విగ్రహాలకు విశేష అభిషేకాలు చేశారు. లక్ష్మీగణపతి హోమాలు నిర్వహించారు.

19న రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి సమీపంలోని జాలి హిల్స్‌లో 19వ తేదీన రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు రామలింగం, పవన్‌కుమార్, ఆనంద్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. అండర్-7, 9, 11, 13, 15 విభాగాలతోపాటు ఓపెన్ విభాగంలో టోర్నీ ఉంటుందని పేర్కొన్నారు. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలకు ట్రోఫీలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 18వ తేదీ సాయంత్రం 5 గంటలకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాల కోసం 9966137908 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మిడ్జిల్: పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ రాజీవ్ రెడ్డి, ఎంపీడీఓ సాయిలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. జీతాలు చెల్లించకుంటే ఈనెల 20 నుంచి పాదయాత్ర చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, సత్తయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



అడ్డాకుల: చదువుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని ప్రోత్సహించాలని ఎంఈఓ రాజేశ్వర్ రెడ్డి సూచించారు. మూసాపేట మండలం తుంకినీపూర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. తొలిమెట్టు కార్యక్రమం అమలును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వివిధ రకాల రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. తెలుగు, ఇంగ్లిష్, గణితంపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం మన ఊరు, మన బడి పనులను పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఇదేమి తిప్పలు..



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కొత్త కలెక్టరేట్‌లో అన్ని సమస్యలే ఉన్నాయి. వివిధ పనులపై వచ్చే ప్రజలకు కనీస వసతులు కరువైతే.. మరో వైపు అధికారులు నిర్లక్ష్యంతో ఇబ్బందులు తప్పడం లేదు. కలెక్టరేట్ సమీకృత భవనం రెండు రెండు అంతస్తుల్లో నిర్మించారు. ఈ కార్యాలయంలో ఏ శాఖ కార్యాలయం ఎక్కడుంది, ఏ నెంబర్ ఛాంబర్‌లో ఉందని తెలిపే సూచిక బోర్డును కలెక్టరేట్ వెనుక భాగంలో ఏర్పాటు చేశారు. ఈ బోర్డు కనిపించకుండా ర్యాకులను అడ్డంగా పెట్టారు. దీంతో బోర్డు కనిపించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గిరిజనుల సంక్షేమానికి అనేక పథకాలు



నవాబుపేటలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న గిరిజన నాయకులు



జడ్చర్లలో గిరిజనుల ఊరేగింపు

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

జడ్చర్ల టౌన్: గిరిజనుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సిగ్నల్ గడ్డ నుంచి శంకరాయపల్లితండా సమీపంలో ఉన్న తుల్జాభవాని ఆలయం వరకు గిరిజనులు భారీ ఊరేగింపు నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలు, గిరిజన పాటలతో ఊరేగింపు ఆకట్టుకుంది. ఊరేగింపులో ఎంపీ, ఎమ్మెల్యే హాజరై, అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మా తండా మా రాజ్యం అంటూ తండాలను ప్రత్యేక పంచాయతీలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

గిరిజనుల అభ్యున్నతికి కంకణం..

నవాబుపేట: గిరిజనుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. గిరిజనులను అన్ని రకాలుగా అభివృద్ధి చేయటం కోసం తండాల్లో వారి పాలన పగ్గాలు వారికే అందించామన్నారు. మండల కేంద్రాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు సేవాలాల్ భవనానికి ఎకరం భూమిని కేటాయిస్తున్నట్లు సభలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే గజమాలతో ఘనంగా సన్మానించారు.

సేవాలాల్ చూపిన సన్మార్గంలో నడవాలి

పాలమూరు: బీజేపీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ కార్యాలయంలో సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ వెంకటేష్ హాజరై చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గోవింద్ నాయక్, కిష్ట్యనాయక్, శివనాయక్, అంజయ్య, నారాయణ యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గిరిజనులకు గుర్తింపు

భూత్పూర్: బీఆర్ఎస్ పార్టీ హయంలోనే గిరిజనులకు గుర్తింపు వచ్చిందని, అది సీఎం కేసీఆర్ ఘనతేనని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూర్ సమీపంలో సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు పట్టణంలోని చౌరస్తాలో మోటర్ సైకిల్ ర్యాలీగా మహాభోగ్ కార్యక్రమం వద్దకు వెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొత్తూర్ సమీపంలో రెండు ఎకరాల స్థలంలో సేవాలాల్ భవనం నిర్మిస్తారని, ప్రతి పాదనలు తయారు చేసి ప్రభుత్వం నిధుల మంజూరు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని జై భీమ్ చౌరస్తాలో నిర్వహించారు. నీలి మెరుపు బహుజన శోభయాత్ర కన్వీనర్ రమేష్ అధ్యక్షతన కార్యక్రమంలో సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నాయకులు పూజలు చేశారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి ముఖ్య కూడలి వద్ద లంబాడా గిరిజన నాయకులు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కల్యాణి, లక్ష్మణ్ నాయక్, నాగేందర్, బద్రునాయక్, బాలునాయక్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిత్రపటం వద్ద భోగ్‌బండారు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతి, ఎంపీఓ అనురాధ, ఎస్ఐ వెంకట్‌రామ్‌నాయక్, లక్ష్మణ్‌పవార్, తిరుపతినాయక్, కృష్ణనాయక్, శంకర్, గణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సేవాలాల్ జీవితం ఆదర్శం

కోయిల్‌కొండ: సేవాలాల్ మహారాజ్ జీవితం ఆదర్శనీయమని, అందరూ ఆయన బాటలో నడవాలని గిరిజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గిరిజన సేవాసమితి ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. గిరిజనులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రామునాయక్, రఘునాయక్, వెంకట్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: పేదల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ అని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మంగంపేట్‌తండా, ఆముదాలగడ్డతండాలో ఉత్సవాలను నిర్వహించారు.



మిడ్జిల్‌లో పూజలు చేస్తున్న గిరిజనులు



కోయిల్‌కొండలో..



ఆముదాలగడ్డతండాలో..

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర: ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోయిల్‌సాగర్ చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గూడె శాంతయ్య ఇటీవల మృతి చెందగా బుధవారం ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి పార్టీ తరపున రూ.2 లక్షల చెక్కును అందజేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న శాంతయ్యకు బీమా ద్వారా వచ్చిన చెక్కును భార్యకు అందజేశామని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు, శంకర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలను పట్టించుకోండి



కోయిల్‌కొండ: మండలంలోని దమయాపల్లిలో డ్రెయినేజీలలో కొన్ని నెలలుగా మురుగును తొలగించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. డ్రెయినేజీలు నిండి ఇండ్లలోకి దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. రోగాలబారిన పడుతున్నామని సర్పంచ్‌కు, కార్యదర్శికి ఎన్నిసార్లు చెప్పిన స్పందించడం లేదని అంటున్నారు. వెంటనే స్పందించి మురుగును తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు నిల్



రామకృష్ణనగర్‌లో ఓపెన్ ప్లాట్లలో నిలిచిన మురుగు



చైతన్యనగర్‌కాలనీలో ఇలా..



వివేకానందకాలనీలోని ఓ గల్లీలో మట్టిరోడ్డు

- 5వ వార్డులో అన్ని కొత్త కాలనీలే..
- చెతన్యనగర్‌లో తాగునీరు రాని పరిస్థితి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో 90శాతం కొత్త కాలనీలే ఉన్నాయి. గతంలో ఎనుగొండ పంచాయతీలో ఉండటంతో ఎక్కువగా కచ్చా నక్షాతోనే ప్రజలు ప్లాట్లు కొన్నారు. వీటికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. దీంతో కనీస సౌకర్యాలు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతమంతా 8ఏళ్ల క్రితమే మున్సిపాలిటీలో కలిసింది. నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి. ముఖ్యంగా చైతన్యనగర్‌కాలనీ (సాంబ శివాలయం దిగువన) ఎత్తు ప్రదేశంలో ఉండటంతో మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీరు అందడం లేదు. సుమారు 200 ఇళ్ల వారు పవర్ బోర్లపైనే ఆధారపడటమే గాక బయట నుంచి క్యాన్లలో ఫిల్టర్ నీటిని తెచ్చుకుంటున్నారు. వివేకానంద కాలనీలో మిషన్‌భగీరథ తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. రెండు రోజులకోసారి క్రమపద్ధతిన వదలాలని కోరుతున్నారు. రామకృష్ణకాలనీ, సగర కాలనీలలో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు చోట్ల మురుగు ఓపెన్ ప్లాట్లలో చేరి కుంటలుగా మారాయి. ఈ రెండు కాలనీల్లో కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉంది. మున్సిపల్ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా వాటిని తరిమేయడం లేదని ఆరోపిస్తున్నారు. కొన్ని నెలల క్రితం పోచమ్మకాలనీలో నిర్మించిన సీసీరోడ్డు అర కిలో మీటరు పొడవున నెర్రలిచ్చింది.

ప్రధాన వీధులు: ఎనుగొండ (కొంత భాగం), ఎస్సీ కాలనీ, పోచమ్మ కాలనీ, జయశంకర్ కాలనీ, సగర కాలనీ, వాసవి కాలనీ, రామకృష్ణ కాలనీ, వివేకానందనగర్, చైతన్యనగర్, విద్యానగర్ కాలనీ, ద్వారకాపురి కాలనీ, ఎస్వీఎస్ ఆస్పత్రి ప్రాంతం, హౌసింగ్ బోర్డు కాలనీ (కొంత భాగం)

5వ వార్డు జనాభా: 5,789

సమస్యలు పరిష్కారం కాలే..



కాలనీలో కొత్త ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ప్రధాన మార్గం తప్ప గల్లీలలో మట్టి రోడ్లే శరణ్యమయ్యాయి. వర్షాకాలంలో ఓపెన్ ప్లాట నిండా నీరు చేరి మట్టి రోడ్లపైకి వచ్చి బురదగా తయారవుతుంది. బైక్‌లు, ఇతర వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

– గోపాల్‌గౌడ్, వివేకానందనగర్

తాగునీరు రావడం లేదు



మా కాలనీకి మిషన్ భగీరథ పథకం పైపులైన్ వేసి మూడేళ్లయినా తాగునీరు మాత్రం రావడం లేదు. ఎత్తు ప్రదేశంలో సుమారు 200 ఇళ్లు ఉన్నాయి. అధికారులకు చెప్పినా ప్రయోజనం దక్కడం లేదు. 4 గల్లీల్లో డ్రెయినేజీలు, సీసీరోడ్లు నిర్మించాలి.

– రమేష్, చైతన్యనగర్

అసెస్‌మెంట్ అయి ఉండాలి



వార్డులో మొత్తం పది కాలనీలు కొత్తగా వెలిశాయి. ఎవరికి వారు ఇంటి ఎదుట డ్రెయినేజీలు నిర్మించుకుంటే సీసీరోడ్డు వేయిస్తాం. అభివృద్ధి పనులకు కొంత సమయం పడుతుంది. కచ్చా లే-అవుట్ ప్రకారమే ఎక్కువ ఇళ్లు నిర్మించుకున్నందున ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్‌తో పాటు మున్సిపల్ అసెస్‌మెంట్ అయ్యి ఉండాలి.

– వనజ, 5వ వార్డు కౌన్సిలర్

విద్యార్థినులకు కరాటే అవసరం



కరాటే శిక్షణలో విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) మార్కెట్ రోడ్డు లో బుధవారం విద్యార్థులకు కరాటే శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఊర్మిళ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు ఆత్మరక్షణ, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకొని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని కోరారు. శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ వెంకటేష్ శిక్షణ ఇచ్చారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మిడ్జిల్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులు



అడ్డాకులలో..

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం భద్యానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో డీఈఓగా శిరీష, హెచ్ఎంగా జశ్వంత్, పలువురు విద్యార్థులు వ్యవహరించారు.

'ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి'



అయ్యవారిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ జిల్లాల వారీగా ఉద్యోగుల విభజన కోసం తీసుకువచ్చిన 317 జీఓతో నష్టపోయిన వారికి వెంటనే న్యాయం చేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులతో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు.

మిడ్జిల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం బలపర్చిన ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బుధవారం మండల కేంద్రంతో పాటుగా అయ్యవారిపల్లి, వస్పుల, బోయిన్‌పల్లి పాఠశాలలో నాయకులు ప్రచారం నిర్వహించారు రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్, బాబునాయుడు, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

మహమ్మదాబాద్/గండేడ్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ పాత్ర ఎంతో గొప్పదని జిల్లా కార్యదర్శి రవికుమార్ తెలిపారు. బుధవారం జూలపల్లి, నంచర్ల, మహమ్మదాబాద్, కొంరెడ్డిపల్లి, గండేడ్, సల్కర్‌పేట్, వెన్నాచేడ్ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ తరపున ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. వెంకటయ్య, సాయన్న, వేణుగోపాల్‌వర్మ, తిరుపతమ్మ, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విద్యనందించడంలో విఫలం

హన్వాడ: పేద విద్యార్థులకు విద్యనందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కిష్టయ్య అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో అభ్యర్థి పావన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. తమ ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని అభ్యర్థించారు. ధనిక రాష్ట్రంలో ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లిండం లేదన్నారు. ఆయన మండలంలోని కొత్తపేట, టంకర, హన్వాడ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.

పండిట్‌లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి

భూత్పూర్: ప్రభుత్వం చేపడుతున్న పదోన్నతుల షెడ్యూల్‌లోనే భాషా పండిట్‌లు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ గజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమచంద్రుడు అన్నారు. బుధవారం ఎస్టీ యూటీఎస్ బలపరిచిన అభ్యర్థి భుజంగరావుకు మద్దతుగా మండలంలోని ఎల్కిచర్ల, పాతమొల్గర, కొత్త మొల్గర, పోతులమడుగు, అన్నాసాగర్, తాటిపర్తి, కర్వెన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు.



ఎంవీఎస్ కళాశాలలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్



మహమ్మదాబాద్ పాఠశాలలో..

ఫార్మసీ విద్యార్థుల రక్తదానం

పాలమూరు: జిల్లా కేంద్రంలోని సరోజినిరా ములమ్మ ఫార్మసీ కళాశాలలో బుధవారం రక్త దాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ పానుగంటి కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా కార్యక్రమాన్ని డాక్టర్ మనోజ్ రాజా ప్రారంభించారు. శిబిరంలో 40మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బాలరాజు, ప్రిన్సిపాల్ కోటేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.